కథానిక

# సాంధ్య సావేరి

యం. రాజ్యలక్ష్మి

సాయంత్రం అయిదు గంటలయింది. పిల్లలందరూ ఆడుకోడానికి పోయినట్టుంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఉన్నట్టుండి వీథిలో పెద్దపెట్టున కేకలు, ఈలలు, నవ్వులు వినిపించాయి. మా వీథికి కోతినాడించే భిక్షగాడు, బాకా ఊదేవాడు అప్పుడప్పుడు రావటం కద్దు. వాళ్ళు వచ్చినపుడు వీథిలో వుండే పిల్ల మూకంతా బిలబిలమంటూ వాళ్ళ చుట్టూ చేరి, వాళ్లు ఆ వీథి వదలి వెళ్ళేవరకూ నానా గల్లంతూ చేస్తుంటారు. వాళ్ళలో ఎవరో ఒకరు వచ్చిఉంటా రనుకున్నా.

ఈ గోల వినింది మా పనిపిల్ల లక్ష్మి. దానికిక పనిమీద బుద్ధి పోవడంలేదు. "చిన్నపిల్ల జడ వేసుకోకుండా పోయింది. కొంచెం పిల్చుకు రావే, లక్ష్మి" అన్నాను. దీనికోసమే ఎదురు చూస్తూన్నానన్నట్టుగా ఒక్క పరుగున లేచి వాకిట్లోకి పోయింది అంట్లు తోముతున్నదల్లా చేతులైనా కడుక్కోకుండా.

పాలవాడు కేకవేశాడు. గిన్నె తీసుకుని వాకిట్లోకి వెళ్ళాను. చూద్దునుగదా, అదేమి జనం! ఒక్క పిల్లలే కాదు. పెద్దవాళ్లు, ఆడవాళ్లు, మగవాళ్లు ఒకరేమిటి అన్నిరకాల వాళ్లు, ఒక రెండు వందలమందిదాకా మా వీథి చివరన, ఒక ఇంటి వాకిట గుమిగూడారు. క్వీన్ మేరీస్‌లో ఇంటరు చదువుతున్న మా పక్కింటి అమ్మాయి, మా కుడిచేతి వైపు ఇంట్లో ఉంటున్న బట్టల బిజినెస్ మాన్, మా యింటి కెదురుగా ఉంటున్న పత్రికా రచయిత, మా యింటి కింది భాగంలో ఉంటున్న రిటైర్డ్ కలెక్టరు, మా పాలవాడు, చాకలి మనిషి వీరందరూ వాళ్ళలో ఉన్నారంటే మీరే ఊహించుకోవచ్చు ఇంకా ఎన్ని రకాల వాళ్లు అక్కడ ఉండడానికి అవకాశముందో!

సరే, మా చిన్న పిల్ల ఇంటికి వచ్చే అవకాశం ఏమీలేదనుకొని ఇంట్లోకి వచ్చా. ఇంతకూ ఇన్ని రకాల జనం అక్కడెందుకు మూగిందో తెలియలేదు.

పాలు కుంపట్లోపెట్టి పని చూచుకుంటున్నాను.

"అక్కడొక పిచ్చివా డున్నాడమ్మా కిటికీ ఊచలన్నీ కొరుకుతున్నాడు" అంటూ ఎగురుకుంటూ వచ్చింది లక్ష్మి."

"పోయి పని చూడవే పొద్దు కాస్తా కూకింది."

"అదిగాదమ్మా. ఆ పిచ్చివాడికి మాటలు రావమ్మా. ఆ ఇంట్లో వాళ్ళ మనిషేనంట, పదమూడు సంవత్సరా లయిందంట ఇల్లు వదిలి పోయి. ఇయ్యాల్లొచ్చాడు మళ్ళీ. కాళ్లూ చేతులూ కట్టేశారమ్మ-ఒకటే అరుపులు."

పిచ్చివాడంటే జ్ఞాపకం వచ్చింది. మేం గూడూర్లో ఉండగా, మేం కాపరం ఉన్న ఇంట్లో శేషమ్మ అనే ఒక పిచ్చి అమ్మాయి ఉండేది. కదిలిస్తే చాలు ఒకటే తిట్లు. అదైనా అందర్నీ తిట్టదు. తన తమ్ముణ్ణి, మరదల్నీ మాత్రమే శపించేది ఇరవై నాలుగు గంటలూ. కాని ఒక్క దుర్గుణం మాత్రం ఉండేది. అదేం ఖర్మమో కాని నామాట తప్ప, ఇంక బ్రహ్మదేవుడు వచ్చినా సరే లెక్క పెట్టేది కాదు. స్నానం చేయడం, భోంచేయడం, ప్రతి చిన్న పనీ నేను దగ్గరుంటేనే తప్ప చేసేది కాదు. కొన్నాళ్లకు మందూ మాకూ ఏమీ లేకుండానే, ఏ దేవుడి దయవల్లనో మళ్ళీ మామూలు మనిషయింది మేం ఆ వూర్లో ఉండగానే. ఇప్పటికి కూడా అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూంటుంది.

పక్కింటి చంద్ర రొజుకుంటూ వచ్చింది. "అత్తా పిచ్చివాణ్ణి ఒకసారి వచ్చి చూడరూ. పాపం కాళ్లూ చేతులూ కట్టేశారు" అంది జాలిగా. మరు క్షణంలోనే నవ్వుతూ "అత్తా ఎదిరింటి పాలవాడంటున్నాడూ, నోరుకూడా

కట్టెయ్య కూడదూ అని, నోరెలా కట్టారు వాడితెలివి మండ" అంటూమళ్ళీ మాయమైంది.

పాపం నిజమే. లాడాలు కొట్టే గొడ్లను మాదిరి కాళ్ళూ చేతులూ కట్టి పడేశారట. వాడేమనుకుంటూంటాడో. వాడి బుర్రలో అసలు ఆలోచన్లనేవి ఉంటాయా?

పిచ్చివాళ్ళ పని హాయి అంటాడు మా పెద్దబ్బాయి. "వాళ్లు దేన్ని గురించి విచారించరు. ఆలోచించరు. వాళ్ళను మనమేమన్నా కూడా అర్థంకాదు. దాన్నిగురించివాళ్లు బాధపడరు." ఆలోచన లేకపోవడం ఎంత సుఖం. మనలో ముప్పాతికమంది ఈ ఆలోచనల వల్లనే నాశనమౌతూంటారు.

సున్నితమైన మనస్సుండే వాళ్ళకే సాధారణంగా పిచ్చి పడుతుందనేవాడు మా అన్న. ఎందుకంటే వాళ్లు ప్రతి విషయం గురించి తీవ్రంగా తర్జన భర్జన చేసుకుంటూంటారట. ఆత్మాభిమానం ఎక్కువ గలవాళ్ళయితే, వాళ్ల ఆవేదన, బాధ,ఇతరులకు చెప్పడానికి ఇష్టపడక తమలో తామే మ్రగ్గుతారట. మా అన్న అన్న ఈ మాటలకు నిదర్శనంగా ఒకటి చెప్తాను. మేం చిన్నప్పుడు స్కూల్లో చదువుకునే రోజుల్లో ఒక మేస్టారుండేవాడు. ఆయనకు భార్యా నలుగురు మొగపిల్లలూ, ఒక ఆడపిల్లా! పిల్లల్లో ఒక్కరికూడా ప్రపంచజ్ఞానం లేకపోవడం అటుంచి ఒకరికి మూగ, ఒకరికి నంగి, ఒకరికి ఎతిమతం ఈ విధంగా ఉండే వాళ్లు. భార్య సరే సరి. సాయంత్రమైతే మోపెడు పూలు పెట్టుకోవడం తప్పితే మరొకటి తెలిసేదికాదు ఆమెకు. ఈ సంతానాన్నీ, సతీమణినీ చూడలేక ఆయన క్రుంగి కృశించి పోయినాడు. బళ్ళో మాబోటి పిల్లల్ని ఎంతో ఆప్యాయంగా దగ్గరకుతీసేవాడు. కాని తమాషా ఏమిటంటే ఈయనకు పిచ్చిపట్టలేదు. కొన్నాళ్ళకి జ్వరం, విపరీతమైన తలపోటూ, వచ్చి మాటపడిపోయింది. డాక్టర్లు ఏదో కొత్తపేరు పెట్టారు. కడాపట మెదడులో చీలికపడిందని అన్నారు. ఎలాగైతేనేం రెండుమూడు రోజుల్లో పరలోకానికి ప్రయాణమయ్యేడు.

"అమ్మా ఇంటికిపోతానమ్మా" అందిలక్ష్మి.

"కాఫీగింజలు కొట్టిచ్చి పోవే!"

"రేపుపొద్దున త్వరగా వస్తానమ్మా. అక్కడికిపోయి కాసేపు చూచి పోతా" అంటూ పోయింది.

పిచ్చివాళ్ళను చూడడానికి అందరికీ సరదాయే. లేకపోతే ఎవరిపనులు వాళ్లు మానుకుని అంతమంది అక్కడ కూడారే! కూలిడబ్బులకు రిక్షా లాగుకునేవాళ్లు కూడా రిక్షాలను దూరంగా నిలిపి అక్కడికి వచ్చారు వింత చూడడానికి. పసిపాపలు ఏడుస్తూన్నా లెక్కచెయ్యకుండా ఉన్నారు తల్లులు. ఆఫీసునుంచి ఆదరాబాదరా ఇంటికిపోయే మగవారు ఇంటిమాటే మరిచి నిలబడిపోయారు. దూడలకు చిక్కకుండా ఆవులను తోలుకునివస్తున్న పాలవాళ్ళు కూడా వాటిని వదిలేసి డబ్బాలతో సహా ఆగుంపులో చేరిపోయారు. ఇక పిల్లగుంపు సంగతి చెప్పనే అఖ్ఖర్లేదు. పిచ్చివాడు కేక పెట్టినప్పుడల్లా ఒక్కపరుగు పెట్టడం మళ్ళీ ముందుకు రావటం, అసలు ఆర్భాటమంతా వాళ్ళదే.

పొద్దు బాగా కూకింది. పిల్లలు ఒక్కరైనా రాలేదు. ఎందుకొస్తారు? ఇవాళ భోజనాలెప్పటి కౌతాయో. ఇంట్లో పనేమీ లేకపోవడంవల్ల డాబామీదికిపోయి అదేదో చూద్దామని వెళ్లేను.

ఆ పిచ్చివాడికి స్నానం చేయిస్తున్నారు ఒక పదిమందికలిసి. పాపం చలో ఏమో ఉన్నట్టుండి ఒక్కొక్క పొలికేక పెడుతున్నాడు.

"అమ్మా అన్నం పెట్టవూ" రవి వచ్చాడు.

"మిగతా వాళ్ళేరిరా"

"అక్కడున్నారమ్మా... అమ్మా, ఆ పిచ్చివాడు, రమణ లేడూ, వాళ్ళ పెద్దక్క మొగుడటమ్మా. ఆనర్సు పరీక్షలో తప్పిపోయినాడట. అంతే, ఎవ్వరికీ చెప్పకుండా పోయినాడట. తర్వాత వాళ్లు ఎక్కడెక్కడనో వెదికి వెదికి, ఆశ వదులుకొన్నారట. మళ్ళి ఈరోజేనట అతన్ని వాళ్లు చూడ్డం."

పరీక్ష పోతేనే పిచ్చి పట్టితే ఇంకేమైనా ఉందా, పాపం వెఱ్ఱివాడు. పరీక్షలో నెగ్గడమే జీవిత పరమావధి అనుకున్నాడు. పరీక్ష తప్పిపోతే జీవితమే శూన్యమనుకున్నాడు.

"బలే తెలివితేటలు గలవాడటమ్మా. అన్ని

ట్లోనూ మొదటి మార్కులు తెచ్చుకొనే వాడట. ప్రెసిడెన్సీలో మొదటివాడుగా వస్తాడని అనుకున్నారట. తీరా పరీక్షల సమయం వచ్చేసరికి అసలు రాయనే లేకపోయాడట. దాంతో మతి చెడిందట'' వాడు ఇంత సేపూ ఆ గుంపులో ఉండి తెలుసుకొన్న సంగతులివీ.

కొందరు, జీవితంలో కొన్నిటినే నమ్ముకొని వాటికోసం విశ్వప్రయత్నాలు చేస్తారు. అన్నీ కలిసివచ్చి గీత బాగుంటే బాగుపడటమే కాక దానివల్ల తాను కోరింది లభించిందే అన్న అహంభావంకూడా ఏర్పడి, నిశ్చలమైన శుద్ధమైన ఏకాగ్రతతో సాధింపబూనితే మనకు లభించనిదంటూ ఈ ప్రపంచంలో ఏదీ ఉండదని ఒక నమ్మకంకలిగి ఆ నమ్మకాన్నే అందరిలోనూ కలగజెయ్యడానికి ప్రయత్నిస్తారు. కాని, అందరూ వారి కొక్కవలసినవన్నీ పొంది సుఖంగాఉంటే మరి చిక్కు లెలా వస్తాయి. అలా పొందలేక పోవడానికి అనేక కారణాలుండవచ్చు. కొంతమంది జీవితంలో వాళ్లు సాధించ దలచుకున్నవి సాధించ లేకపోవచ్చు. వాళ్లు అందుకోదలచిన స్థాయిని అందుకోలేక పోవచ్చు. వారు సంపాదించ దలచుకున్న ఒక అమూల్యవస్తువు వారి చేయి జారిపోవచ్చు. అంతమాత్రంచేత, జీవితాలు చాలించడంగాని, పిచ్చెత్తడంగాని జరగడం అసందర్భం అని చెప్పలేం, కాని విచారకరం కదా.

ఈ పిచ్చివాణ్ణే తీసుకుందాం. ఆనర్సు పరీక్షలో ప్రెసిడెన్సీకంతకూ ప్రథముడుగా రావడమే తన జీవితలక్ష్యమనుకున్నాడు. అదెప్పుడైతే అసంభవమని తోచిందో, ఇక జీవించడంలో అర్థం లేదనుకున్నాడు. ఆనర్సు డిగ్రీ లేకపోతే ప్రపంచంలో ఎందుకూ కొరగాననుకున్నాడు. తన విలువను గురించి అంతే తెలిసింది ఆ యువకుడికి.

"అమ్మా ఆకలవుతూంది. అన్నం పెట్టమ్మా'' అన్నాడు రవి.

కిందికివచ్చి వాడికన్నం పెడుతూన్నాను. పిల్లలందరూ వచ్చేశారు.

"అమ్మా, వాణ్ణి పిచ్చిఆసుపత్రికి తీసుకుపోతారట. ఆస్పత్రివాళ్ళకు ఫోన్ చేశారట. కాసేపట్లో వాళ్ళ కారు వస్తుంది'' అనింది చిన్నమ్మాయి.

"ఆస్పత్రిలో ఏంచేస్తారమ్మా?'' అమాయకంగా అడిగింది చిన్నమ్మాయి. "ఆస్పత్రిలో ఏంచేస్తారు? మందిచ్చి బాగుచేస్తారు. నెమ్మదించిన తర్వాత ఇంటికి పంపిస్తారు'' అన్నాడు రవి మహా తెలిసిన వాడిమాదిరి.

మళ్ళీ వీథిలో గోల ఎక్కువైంది. ఈమాటు పిచ్చివాడి అరుపులే ఎక్కువగా ఉన్నాయి. అందరం వీథిలోకివచ్చాం. నలుగురూచేరి ఎంతో కష్టంమీద వాణ్ణి ఒకరిక్షా ఎక్కించారు. కూడా ఒక పోలీస్ కాన్‌స్టేబుల్ కూడా ఉన్నాడు. పిచ్చివాడు కేకలు పెడ్తూనేవున్నాడు. ఎలాగైతేనేం రిక్షా మావీథి దాటిపోయింది వెనక ఒక పెద్ద గుంపుతోసహా.

ఎక్కడికి? పోలీసు స్టేషనుకు ఇంతాచేసి. ఆస్పత్రికి కాదు. ఎవరో వెళ్ళి "మా వీథికి ఒక పిచ్చివాడు వచ్చాడు. అందర్నీ కొట్టడం తిట్టడం కొరకడం చేస్తున్నాడు. అతన్ని ఇంట్లోకి తీసుకవెళ్ళడానికి వాళ్ళవాళ్ళే భయపడుతున్నారు. అలా వీథిలో ఉంచడం ప్రమాదం'' అని పోలీసు స్టేషనులో రిపోర్టుచేశారట. దాంతో వాళ్లు వచ్చి తీసుకపోయారు. మనవాళ్ళకు అప్పుడప్పుడు "చావు తెలివి''అంటూరే, అటువంటిది వస్తూంటుంది.

ఒకవారంక్రితం, మా ఇంటి పక్కరూములో ఇద్దరు రౌడీలు, రాత్రి పన్నెండు గంటలప్పుడు పెద్దగొడవచేస్తే వీథంతా పోగడ్డారు కాని, ఒక్కడికూడా పోలీసు స్టేషన్‌దాకా పోవడానికికాని, దగ్గర్లో ఉన్న పబ్లిక్ టెలిఫోనుకు పోయి ఫోన్ చేయడానికిగాని ధైర్యం లేకపోయింది. వాళ్ళలో ఒకడు వచ్చి అందర్నీ వెళ్ళమనగానే రెండు నిముషాల్లో వీథంతా ఖాళీ అయింది. తర్వాత యథావిధిగా వాళ్ళ పని వాళ్ళు సాగించుకున్నారు.

"పోలీసు స్టేషన్లో మందిస్తారా అమ్మా'' అంటుంది చిన్నమ్మాయి. "మందూ లేదూ మాకూలేదు. ఒకగదిలోపెట్టి తాళం పెట్టారు. వాణ్ణి పిచ్చివాణ్ణి చేసింది మనమేకద! మళ్ళీ మందు దేనికి? వాడికి కావలసిన మందు మనదగ్గిర లేదు.'' అన్నాను.